పోలింగ్‌కు సిద్ధం

- సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కర్నూలు అసెంబ్లీ పరిధిలో మొత్తం ఓటర్లు 2,74,465
- పోలింగ్ స్టేషన్లు 258
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ


ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి 33 వార్డు డివిజన్లలో 258 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించారు. వికలాంగుల కోసం ప్రత్యేక ర్యాంపుల ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందును పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్ల కోసం షామియానాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,74,465 మంది ఉన్నారు. వీరిలో 1,32,769 పురుష ఓట్లు,1,41,665 మహిళా ఓటర్లు ఉన్నారు. ఇతరులు 31 మంది ఉన్నారు.అన్ని పోలింగ్ స్టేషన్లలో సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కు వినియోగించుకోవాలని కర్నూలు ఆర్‌ఓ భార్గవ్‌తేజ పిలుపునిచ్చారు.

240 మంది మైక్రో అబ్జర్వర్లు

కర్నూలు నగరంలో పోలింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించేందుకు 240 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. 325 వీవీ ప్యాట్‌లు ఏర్పాటు చేశారు. 21 మంది సెక్టార్ ఆఫీసర్లు పనిచేస్తున్నారు. మైక్రో అబ్జర్వర్లు ఉదయం నుంచి సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు నిరంతరం పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అలాగే ప్రతి పోలింగ్ స్టేషన్‌ను అనుసంధానం చేస్తూ100 శాతం వీడియోగ్రఫీ ద్వారా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పోలింగ్ స్టేషన్‌లో ఓటు ప్రక్రియను నిశితంగా పరిశీలిస్తారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

నేడు జరిగే పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఔట్‌డోర్ స్టేడియం డిస్పాచ్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీని పర్యవేక్షించారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ కర్నూలు నియోజవర్గ పరిధిలో ఎన్నికల సామగ్రి వాహనాల్లో పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నాయన్నారు. పోలింగ్ సిబ్బందితో సెక్టోరల్ అధికారులు, పోలీసు సిబ్బంది, బూత్ లెవల్ ఆఫీసర్లు ఉన్నారన్నారు. 258 పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 258 అసెంబ్లీ, 258 పార్లమెంటు ఈవీఎంలు కేటాయించారన్నారు. అలాగే శిక్షణ పొందిన 258 పీఓలు, 258 ఏపీఓలు, 1032 ఓపీఓలు ఎన్నికల్లో విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. అన్ని మౌలిక సదుపాయాలతో పోలింగ్ స్టేషన్లను సన్నద్ధం చేశామన్నారు. ఓటర్లందరూ పెద్ద ఎత్తున్న పోలింగ్ స్టేషన్లకు తరలి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.


డిస్పాచ్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న పోలింగ్ అధికారులు, సిబ్బంది

క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు


జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో ఆదివారం జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు –2024 అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలకు కోత

- ఆర్‌యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటికి కోత విధిస్తారని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ (ఆర్‌యుఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలుకు పలు రకాల నిబంధనలు పెట్టి పేదలకు అందకుండా చేస్తారని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు ప్రకటించిన నిరుద్యోగ భృతి గురించి నిరుద్యోగులను అడిగితే చెబుతారన్నారు. సాధ్యం కాని అనేక హామీలను మేనిఫెస్టోలో చేర్చి సూపర్ సిక్స్ అంటు ప్రజలను మభ్యపెడుతున్న చంద్రబాబును నమ్ముకుంటే అనేక కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని నవరత్నాల పేరిట అమలు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ తిరిగి అమలు చేస్తామని చెప్పారన్నారు. తాను ఏమి చేస్తాడో వాటినే వైఎస్ జగన్ చెబుతారే తప్ప అబద్ధాలు చెప్పి ప్రజలను మోసగించే నైజం ఆయనది కాదన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమానాభివృద్ధిని కోరే వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

ముస్లిం మైనార్టీల పక్షపాతి వైఎస్ జగన్

- ఏపీ ముస్లిం మైనారిటీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ రోషన్ ఆలీ

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల రిజర్వేషన్ల పరిరక్షణ తన పూర్తి కర్తవ్యమని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనారిటీల పక్షపాతిగా చరిత్రలో నిలిచిపోనున్నారని ఆంధ్రప్రదేశ్ ముస్లిం మైనారిటీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ రోషన్ ఆలీ, సేవాస్థంబ్ జిల్లా ఉపాధ్యక్షుడు సీబీ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రంలో అమలవుతున్న నాలుగు శాతం ముస్లిం మైనారిటీ రిజర్వేషన్ బిల్లును రాష్ట్రంలోని ముస్లింలకు వర్తింపజేస్తామని వైఎస్ జగన్ చెప్పారన్నారు. అందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మైనారిటీల పట్ల ప్రత్యేక చొరవ తీసుకొని అందరిని సమ దృష్టితో చూస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ముస్లిం ప్రజానీకం, ఆఫీజ్ ఉలేమాలు, ముల్లాలు, జామియా మసీద్ ముతవల్లీలు వైఎస్ జగన్‌కు అండగా ఉండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ విభాగం సమన్వయకర్తలు బైలుప్పల షఫీవుల్లా పాల్గొన్నారు

రిసెప్షన్ సెంటర్లలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయండి

- నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్/ ఎన్నికల అధికారి సృజన ఆదేశం


ఆర్‌యూలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన

కర్నూలు (సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు పోలింగ్ అనంతరం వచ్చే పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్/ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అన్ని నియోజకవర్గాల రిసెప్షన్ సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిసెప్షన్ సెంటర్లకు వచ్చే పోలింగ్ సిబ్బందికి ప్రతి మూడు గంటలకు ఒకసారి భోజనం వండి అందజేయాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చేందుకు బ్యాచుల వారీగా హమాలీలను సోమవారం సాయంత్రం నాటికి ఏర్పాటు చేసుకోవడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకమైన టీషర్టు అందజేయాలని సివిల్ సప్లయిస్ డీఎంను కలెక్టర్‌ను ఆదేశించారు. పార్కింగ్ దగ్గర తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్లలో డేటా ఎంట్రీ చేసుకోవడానికి ఇంటర్నెట్/వైఫై హాట్ స్పాట్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో నిరంతరం ఫీడ్ ఉండేలా చూడాలన్నారు. జూన్ 4వ తేదీ వరకు విద్యుత్ అంతరాయం లేకుండా 3 స్ట్రాంగ్ రూమ్‌ల కెమెరాల దృశ్యాల లైవ్ ఫీడ్ నిరంతరం రికార్డు అయ్యేలా పవర్ బ్యాక్ అప్/జనరేటర్/యూపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బంది కోసం ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని డీఆర్‌ఓను ఆదేశించారు. నోడల్ అధికారులు రిసెప్షన్ సెంటర్లలో అందుబాటులో ఉంటూ రిటర్నింగ్ అధికారులకు తగిన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. పార్కింగ్ దగ్గరే బారికేడ్లు ఏర్పాటు చేసి పోలింగ్ సామగ్రి తీసుకొచ్చే ఏపీఓ, పీఓలు మాత్రమే లోనికి అనుమతించి, మిగతా సిబ్బందిని పార్కింగ్ ప్రదేశం దగ్గరే నిలువరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్ రావు, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, కుడా వైస్ చైర్మన్ సూర్యప్రతాప్ నారాయణరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, సివిల్ సప్లయ్ డీఎం షర్మిల, డీఎస్‌ఓ మూర్తి, హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీటీసీ శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, మైనార్టీ సంక్షేమ అధికారి సునిల్ ఖన్నా, టిడ్కో ఎస్‌ఈ రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

రారండోయ్.. ఓటేద్దాం

- పాణ్యం నియోజకవర్గంలో 3,31,706 మంది ఓటర్లు
- బరిలో 14 మంది అభ్యర్థులు
- 357 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది


జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్‌లో ఉద్యోగులకు విధులు కేటాయిస్తున్న ఆర్వో నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పాణ్యం అసెంబ్లీ, నంద్యాల ఎంపీ స్థానాల పోలింగ్ కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 14 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి గౌరు చరితారెడ్డి మధ్య ఉండనుంది.

పోలింగ్‌కు కేంద్రాలకు తరలివెళ్లిన సిబ్బంది

నియోజకవర్గంలో మొత్తం 3,31,706 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 357 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ప్రత్యేకంగా ర్యాంపులు, వీల్‌చైర్లను ఏర్పాటు చేశారు. అలాగే తాగునీరు, నిరంతర విద్యుత్, టాయిలెట్లు, బాత్‌రూమ్‌లను ఓటర్లు, సిబ్బందికి అనుకూలంగా ఏర్పాటు చేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్పాచ్ సెంటర్ నుంచి పోలింగ్ సామగ్రిని ఆదివారం మధ్యాహ్నం సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలించారు. సుమారు 1600 మంది సిబ్బందితో పాటు 425 బ్యాలెట్, 425 కంట్రోల్ యూనిట్లు, 456 వీవీప్యాట్లు కేటాయించారు. వీటిని సిబ్బంది తమతోపాటు తీసుకుని ఆయా పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. అక్కడ సోమవారం ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు మాక్ పోలింగ్‌ను రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహిస్తారు. అనంతరం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 6 గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి టోకెన్‌లు ఇచ్చి ఓటు వేసే హక్కును కల్పిస్తారు. ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య జీపీఎస్‌తో కూడిన వాహనాల్లో కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు తరలిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి జూన్ 4వ తేదీ కౌంటింగ్ నిర్వహిస్తారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

పాణ్యం నియోజకవర్గంలో మొత్తం 357 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో రెండు లోకేషన్లలో మూడు అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, 21 లోకేషన్లలో 64 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటి పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. దాదాపు 500 మంది పోలీసులతో పహారా కాసేలా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లతో పరిశీలన చేయించడంతోపాటు వీడియోగ్రఫీ తీయిస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

7 గంటలకు పోలింగ్ మొదలు కావాలి

- ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు (సెంట్రల్) : నేటి (సోమవారం)ఉదయం 7 గంటలకు పోలింగ్ ఖచ్చితంగా మొదలు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి పోలింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎంపీడీఓ, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ మొదలుపెట్టి 6:30 గంటలకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మాక్ పోల్‌లోని ఓట్లను తొలగించి 6:45కు కంపార్ట్‌మెంట్లలో మిషన్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్లు ఆదివారం రాత్రి అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి పోలింగ్ స్టేషన్ ఈవీఎం ఎలా కనెక్ట్ చేయాలి, మాక్‌పోల్ నిర్వహణపై వీడియోలు చూసి రిఫ్రెష్ అయ్యేలా పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు నేటి ఉదయం 7 గంటలకే అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి అన్ని మిషన్లు పనిచేస్తున్నాయా లేదా అని తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, సెక్టార్ ఆఫీసర్లు ఏదో ఒక పోలింగ్ స్టేషన్‌లో మాక్ పోల్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతానికి సంబంధించిన నివేదికలను పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ నిర్వహణలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.